# ముమ్మరంగా వరినాట్లు

- జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 10 వేలకు పైగా ఎకరాల్లో సాగు
- ఇప్పటి వరకు 22 శాతం ఎకరాల్లో నాట్లు పూర్తి



వరినాట్లు వేస్తున్న దృశ్యం

**జంగారెడ్డిగూడెం:** జంగారెడ్డిగూడెం డివిజన్‌లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 22 శాతం వరినాట్లు పూర్తయ్యాయి. డివిజన్ మొత్తం మీద రబీ సాధారణ విస్తీరణం 10,618 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 2,257 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. ఈ నెలాఖరులోగా మిగిలిన విస్తీర్ణంలో వరినాట్లు పూర్తవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా కేఆర్ పురం డివిజన్ పరిధిలో 127 ఎకరాల్లో రైతులు వరి నారుమడులు పోశారు. అలాగే రబీ సీజన్‌కు సంబంధించి డివిజన్‌లో మొక్కజొన్న, చెరుకు, వేరుశెనగ, పొగాకు పంటలను రైతులు పండిస్తున్నారు. ఖరీఫ్‌కు సంబంధించి అన్ని రకాల పంటలు 66,668 ఎకరాల్లో రబీ సాగు చేస్తుండగా, ఇప్పటి వరకు 29,390 ఎకరాల్లో పంటలు వేశారు. మిగిలిన విస్తీర్ణంలో పంటలు వేయాల్సి ఉంది. వరికి సంబంధించి బుట్టాయగూడెం మండలం 57 ఎకరాల్లో వరి పంట వేయాల్సి ఉంది. జంగారెడ్డిగూడెం మండలంలో 6,852 ఎకరాలకు గానూ 1,379 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. అలాగే జీలుగుమిల్లిలో 54 ఎకరాల్లో వరినాట్లు వేయాల్సి ఉంది. కొయ్యలగూడెం మండలంలో 907 ఎకరాలకు గానూ 98 ఎకరాల్లో, పోలవరం మండలంలో 2674 ఎకరాలకు గానూ 780 ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి. కుక్కునూరు మండలంలో 54 ఎకరాల్లో, వేలేరుపాడు మండలంలో 20 ఎకరాల్లో నాట్లు పడాల్సి ఉంది. మొక్కజొన్న డివిజన్ మొత్తం మీద 29,995 ఎకరాల్లో సాధారణ విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకు 10,054 ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు వేశారు. ఇక చెరుకు డివిజన్‌లో 2,965 ఎకరాల్లో సాధారణ విస్తీర్ణం కాగా, 349 ఎకరాల్లో చెరుకు పంటను రైతులు వేశారు. ఇక వేరుశెనగ పంటకు వచ్చేసరికి 1,510 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, దానిని మించి 1,612 ఎకరాల్లో వేరుశెనగ పంట వేశారు. ఇక పొగాకు పంటకు వచ్చేసరికి 20,776 ఎకరాల్లో సాధారణ విస్తీర్ణం కాగా, 14,884 ఎకరాల్లో రైతులు పొగాకు పంటను వేశారు.

### నెలాఖరులోగా నాట్లు పూర్తి చేసుకోవాలి



ఈ నెలాఖరులోగా రైతులు వరినాట్లు పూర్తి చేసుకోవాలి. నాట్లు వేసిన 3 నుంచి 5 రోజులలోపు కలుపు మందును చల్లుకోవాలి. యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలి. రైతులకు ఏదైనా సందేహం ఉంటే వ్యవసాయశాఖాధికారులను సంప్రదించాలి.

– పీజీ బుజ్జిబాబు, ఏడీఏ, కేఆర్ పురం

## క్లుప్తంగా

### పోలవరం నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికం

**బుట్టాయగూడెం:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు తుది జాబితా సిద్ధమయ్యింది. తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ విడుదల చేశారు. పోలవరం నియోజకవర్గం తుది జాబితాలో సుమారు 2,52,592 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,22,201, మహిళలు 1,30,380, ఇతరులు 11, ఉండగా కొత్తగా 8,279 ఓట్లు పెరిగాయి. అయితే ఈసారి ప్రకటించిన ఓట్ల జాబితాలో మహిళలదే పైచేయిగా ఉంది. పురుషుల కంటే 8,179 మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో 2,38,820 ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 1,16,743, స్త్రీలు- 1,22,059, ఇతరులు 18 ఉన్నారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రకటించిన ఓటర్ల జాబితాలో సుమారు 8,279 ఓట్లు కొత్తగా పెరిగాయి. తుది జాబితా విడుదల కావడంతో త్వరలోనే ఎన్నికలు కూడా జరిగే అవకాశం ఉన్నందున రాజకీయ పార్టీలు కూడా ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి.

### రాజకీయ నాయకులతో ఆర్డీవో సమావేశం



బుట్టాయగూడెంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ అద్దయ్య

**బుట్టాయగూడెం:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఓటర్ల నమోదుపై రాజకీయ నాయకులు, తహసీల్దార్‌లతో జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుది ఓటర్ల జాబితా వివరాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అభిప్రాయాలను చెప్పే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శారా శాంతి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

### అంజన్నకు ప్రత్యేక పూజలు

**జంగారెడ్డిగూడెం రూరల్:** మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి రూ.1,28,194 ఆదాయం సమకూరినట్లు, 1,000 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.

### ఏపీటీఎఫ్ ద్వారకాతిరుమల మండల శాఖ ఏర్పాటు

**ద్వారకాతిరుమల:** మండలంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ శాఖను ప్రారంభించినట్లు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మండల శాఖ కన్వీనర్‌గా గుణ్ణంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావు, కో కన్వీనర్‌గా జి.కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న జి.నాగేశ్వరరావు నియమితులయ్యారు.

### పోగొట్టుకున్న యాపిల్ ఫోన్ లభ్యం



భక్తురాలు శ్రావ్యకు ఫోన్‌ను అందిస్తున్న హోంగార్డులు, దేవస్థానం సిబ్బంది

**ద్వారకాతిరుమల:** శ్రీవారి క్షేత్రంలో హోంగార్డులు, దేవస్థానం సిబ్బంది ఒక భక్తురాలు పోగొట్టుకున్న యాపిల్ ఫోన్‌ను తిరిగి ఆమెకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. దుబాయ్‌కు చెందిన శ్రావ్య మంగళవారం శ్రీవారి దర్శనార్థం ఆలయానికి వచ్చింది. స్థానిక తూర్పు రాజగోపుర ప్రాంతంలో తన యాపిల్ 15 ప్రో ఫోన్‌ను పోగొట్టుకుంది. స్వామివారి దర్శనానంతరం ఆలయం నుంచి బయటకు వచ్చిన ఆమె ఫోన్ పోయిన విషయాన్ని గుర్తించి, వెతకడం మొదలుపెట్టింది. అయితే ఫోన్ సెక్యూరిటీ సిబ్బందికి దొరకడంతో దాన్ని హోంగార్డులు, దేవస్థానం సిబ్బంది శ్రావ్యకు అప్పగించారు.

### పథకాలు వినియోగించుకోవాలి

**జంగారెడ్డిగూడెం:** కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం బాలుర హైస్కూల్ నందు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన, పీఎం స్వనిధి, పీఎం సురక్ష బీమా, ఆయుష్మాన్ తదితర పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, ఎస్‌కే అమీర్, కంచర్ల విష్ణు, నేట్రు గణేష్, పి.త్రిమూర్తులు, కౌన్సిలర్‌లు ఏపీ రమణమూర్తి, సంకు సురేష్ పాల్గొన్నారు.

### నిర్వాసిత కాలనీలో పర్యటించిన సినీ దర్శకుడు



కాలనీవాసులతో మాట్లాడుతున్న సినీ సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్

**జంగారెడ్డిగూడెం రూరల్:** మండలంలోని తాడవాయి పంచాయతీ చల్లవారిగూడెం పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసిత కాలనీలో ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మంగళవారం పర్యటించారు. త్వరలో ఆయన దర్శకత్వంలో తెరకెక్కనున్న ఓ చిత్రానికి సంబంధించిన కథ కోసం ఆయన నిర్వాసిత కాలనీలో పర్యటించి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అతి త్వరలోనే ఈ ప్రాంత పరిసరాల్లో షూటింగ్ చేసే అవకాశం ఉన్నట్లు కాలనీవాసులతో చర్చించారు. ఆయన వెంట ఆర్ అండ్ ఆర్ కాలనీ యూత్ అధ్యక్షుడు బద్దె ప్రేమ్‌కుమార్, కమిటీ సభ్యులు చింతపల్లి వీర బ్రహ్మం, పెరుమళ్ల నరసింహారావు, మిరియాల పుల్లారావు తదితరులు ఉన్నారు.

# సంక్షేమం కోసం మళ్లీ జగనన్ననే గెలిపిద్దాం

వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి



బుట్టాయగూడెం సమీపంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రాజ్యలక్ష్మి

**బుట్టాయగూడెం:** ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలబెట్టారని వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని బుట్టాయగూడెం సొసైటీ సమీపంలో సుమారు రూ.58 లక్షల వ్యయంతో సుమారు 90 వేల లీటర్‌ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మండలంలోని పాలకుంటలో రూ.27 లక్షలు, కండ్రికగూడెంలో రూ.27 లక్షలు, వీరన్నపాలెంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించబోయే వాటర్ ట్యాంక్‌ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు, కులమతాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేశారని చెప్పారు. ముఖ్యంగా గిరిజన ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని అన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్యం విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. తనపై ఎంతో నమ్మకంతో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా జగనన్న నియమించారని, అందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. జగనన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఎంపీటీసీలు తెల్లం రమణ, కరాటం ఫణీంద్ర, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, జీసీసీ స్టేట్ డైరెక్టర్ తెల్లం చిన్నారావు, నాయకులు తాళ్లూరి ప్రసాద్, కొదం కడియ్య, నక్కా శివాజీ, దోరేపల్లి త్రిమూర్తులు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**సీనియర్ నాయకులను కలిసిన రాజ్యలక్ష్మి**

బుట్టాయగూడెంలో విస్తృతంగా పర్యటించిన పార్టీ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి పలువురిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పార్టీ సీనియర్ నాయకుడు కరాటం చిన్నరాయుడిని కలుసుకుని పలు అంశాలపై చర్చించారు. అదేవిధంగా గొట్టుముక్కల మల్లికార్జునరావును కూడా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు సహకరించాలని వారిని కోరారు.

### నేడు జీలుగుమిల్లిలో 'జగనన్నకు చెబుదాం'

**బుట్టాయగూడెం(జీలుగుమిల్లి):** జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వద్ద బుధవారం 'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులందరూ పాల్గొంటారని, మండలంలోని ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

### పరిచయ వేదికకు తరలి రావాలి

**టి.నరసాపురం:** కొయ్యలగూడెంలో బుధవారం జరిగే వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి అభ్యర్థుల పరిచయ వేదిక, పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి మండలం నుంచి పెద్ద సంఖ్యలో శ్రేణులు తరలి రావాలని మండల అధ్యక్షుడు శ్రీనురాజు, సీనియర్ నాయకుడు దేవరపల్లి ముత్తయ్య పిలుపునిచ్చారు. ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పలువురు పార్టీ ప్రముఖులు పాల్గొంటారని వివరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### నేడు జంగారెడ్డిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

**జంగారెడ్డిగూడెం:** పట్టణంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ తెలిపారు. స్థానిక 4వ సచివాలయం పరిధిలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం గంటలకు వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**కొయ్యలగూడెం:** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వం పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలి అని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి సూచించారు. మంగళవారం రాజవరం జెడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు బి.రామారావు అధ్యక్షతన జరిగిన విజయకేతనం స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏలేటి చినతుక్కయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఏలేటి రాజు, ఉపాధ్యాయులు గుప్తా, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన పోలింగ్ అవగాహన శిబిరాలు

**కొయ్యలగూడెం:** ఓటర్లకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యాన చేపట్టిన ఈవీఎం ఓటింగ్ అవగాహన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. పరింపూడిలోని పోలింగ్ కేంద్రంలో తహసీల్దార్ పాసం నాగమణి ఆధ్వర్యాన ఈవీఎం ప్రక్రియను ఓటర్లకు సిబ్బంది ద్వారా అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా ఉన్న 60 పోలింగ్ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు ఓటర్లకు అవగాహన కల్పించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మణిదివ్య, వీఆర్‌వోలు, బూత్ లెవెల్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోయినా ఆందోళన వద్దు



చింతలపూడి హైస్కూల్‌లో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఈఆర్ఓ గీతాంజలి

**చింతలపూడి:** ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోయినా ఆందోళన చెందవద్దని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి గీతాంజలి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం సోమవారం విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాలో నియోజకవర్గంలో 2,71,502 మంది ఓటర్లుగా నమోదు అయినట్లు చెప్పారు. వారిలో పురుషులు 1,33,747, స్త్రీలు 1,37,714, ఇతరులు 41 మంది ఉన్నట్లు తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 27వ తేదీ నుండి 2024 జనవరి ఒకటో తేదీ వరకు ప్రత్యేకంగా నిర్వహించిన ఓటర్ల జాబితా సవరణలో 30,675 దరఖాస్తులు రాగా వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది జాబితాను రూపొందించినట్లు తెలిపారు. కొత్త ఓట్ల నమోదు కోసం 15,853 దరఖాస్తులు అందగా 15,244 దరఖాస్తులు పరిష్కరించామన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ఓటు హక్కుపై అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణజ్యోతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల పరిశీలన



సీతంపేట పోలింగ్ కేంద్రంలో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీవో అద్దయ్య

**కొయ్యలగూడెం:** మండలంలోని సీతంపేట గ్రామంలో ఉన్న 205, 206 పోలింగ్ కేంద్రాలను పోలవరం ఈఆర్‌వో, జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతులను ఆయన తెలుసుకున్నారు. సంబంధిత బీఎల్‌వోలు, ఎన్నికల అధికారులకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అలాగే ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.నాగమణి, బీఎల్‌వోలు ఎస్‌వీ సుబ్బారావు, జి.లలిత, గ్రామ పెద్దలు కొప్పుల చంద్రయ్య, రామిని పోతురాజు, కోలా గంగబాబు, తోటకూర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



**చింతలపూడి:** ప్రతిజ్ఞ చేస్తున్న పట్టణ ప్రముఖులు



**జంగారెడ్డిగూడెం:** నేతాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

**చింతలపూడి:** నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని చింతలపూడి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో ఉన్న నేతాజీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి అభిమానులకు పంచారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ నేతాజీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. యువత నేతాజీ అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. నేతాజీ ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు వీరంకి శ్రీనివాసనాయుడు, అఖిల భారత ఓబీసీ నాయకులు పీవీ ప్రసాద్, ఆర్నేపల్లి అప్పారావు, పాకా సర్వేశ్వర రావు, బాలరాజు, తుర్లపాటి బాబు, దూదిగం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**యువతలో స్ఫూర్తిని నింపిన సుభాష్ చంద్రబోస్**

**జంగారెడ్డిగూడెం:** స్వాతంత్య్రం అనేది ఒకరు ఇచ్చేది కాదు, పోరాడి సాధించుకునేది అని యువతలో స్ఫూర్తిని నింపిన ధీరుడు నేతాజీ సుభాస్ చంద్రబోస్ అని విశ్వ హిందూ పరిషత్ నాయకుడు కేవీఆర్ సత్యనారాయణ, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ అన్నారు. నేతాజీ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రధాన బోసుబొమ్మ కూడలిలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు కె.దుర్గాప్రసాద్, బీకే విశ్వనాథ్, గొలుగూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ ఆసరాతో మహిళల్లో ఆనందం



ఎంపీ కోటగిరి శ్రీధర్

**దెందులూరు:** జిల్లాలో 3,89,801 మంది డ్వాక్రా మహిళలకు నాలుగో విడత రూ.362.89 కోట్ల లబ్ధి చేకూరడంతోపాటు పూర్తి స్థాయిలో రుణమాఫీ అవ్వడం తనకెంతో సంతోషంగా ఉందని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. మంగళవారం రాత్రి తన కార్యాలయంలో ఎంపీ మాట్లాడుతూ 2019లో పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల రోజు వరకు అక్కచెల్లెమ్మలు తీసుకున్న డ్వాక్రా రుణాలు నాలుగు విడతల్లో రుణమాఫీ, సున్నా వడ్డీకే రుణం, వడ్డీ పూర్తిగా మన ప్రభుత్వమే కడుతుందని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇచ్చిన మాట తప్పని, మడమ తిప్పని ప్రజానేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక డ్వాక్రా అక్కాచెల్లెమ్మల కోసం వైఎస్సార్ ఆసరా పథకం రూపొందించి అమలు చేశారని చెప్పారు. ఏలూరు జిల్లాలో చింతలపూడి, దెందులూరు, ఏలూరు, ద్వారకాతిరుమల, కైకలూరు, నూజివీడు, పోలవరం, ఉంగుటూరు నియోజకవర్గాల్లో 3,89,801 మంది డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయడం, వారి కుటుంబాల్లో నేడు పర్వదినమని తెలిపారు. జిల్లాలో అక్కచెల్లెమ్మలందరి తరఫున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంపీ శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



శ్రీనివాసపురంలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బాబ్జి

**జంగారెడ్డిగూడెం రూరల్:** నాడు – నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వం తీర్చిదిద్దినట్లు జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి తెలిపారు. మండలంలోని శ్రీనివాసపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, 10 వతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన, మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, హెచ్‌ఎం సీహెచ్ జ్యోతిబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎలికె సోమేశ్వరరావు, వార్డు సభ్యులు వసంతాటి సతీష్ కుమార్, జుజ్జవరపు శ్రీను పాల్గొన్నారు.

## నేర వార్తలు

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**జంగారెడ్డిగూడెం:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్సార్ నగర్‌కు చెందిన సుంకవల్లి రవి పొట్లం యాప్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఫుడ్ డెలివరీ నిమిత్తం పట్టణంలోని బాలాజీ నగర్‌కు వెళుతున్న సమయంలో వేగవరం నుంచి కొయ్యలగూడెం వైపు వేగంగా వస్తున్న కారు బాలాజీని ఢీకొందన్నారు. గాయపడిన అతనిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

**జంగారెడ్డిగూడెం:** వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన దొంతోజు రేవంత్‌కు రాణితో మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. రేవంత్ టైల్స్ వర్క్ చేస్తుంటాడు. ఈనెల 21వ తేదీ రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాణి ఇంటి నుంచి వెళ్లిపోయిందని, తిరిగి రాలేదన్నారు. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో రేవంత్ ఫిర్యాదు చేశాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### మద్యం సీసాల స్వాధీనం

**జంగారెడ్డిగూడెం:** అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 4 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు జంగారెడ్డిగూడెం ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు. పట్టణంలోని బాలాజీ నగర్‌కు చెందిన వి.కనకరాజు వద్ద మద్యం ఉందనే సమాచారం మేరకు దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

### మద్యం విక్రేత అరెస్ట్

**ద్వారకాతిరుమల:** మండలంలోని లక్ష్మీనగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్‌ఈబీ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. భీమడోలు ఎస్‌ఈబీ ఎస్సై జి.వెంకటలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌కు చెందిన ఆలపాటి శేఖర్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం అందినట్లు తెలిపారు. దీంతో సిబ్బందితో కలసి శేఖర్‌ను ఉదయం లక్ష్మీనగర్‌లో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతని వద్ద నుంచి ఇతర రాష్ట్రాలకు చెందిన 8 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం (750 ఎంఎల్) బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ సీతారాం, సిబ్బంది మురళి, మూర్తి, నాగేశ్వరరావు, ఫిలిప్ పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.

### కోడి పందేల స్థావరంపై దాడి

**జంగారెడ్డిగూడెం:** కోడి పందేల స్థావరంపై జంగారెడ్డిగూడెం పోలీసులు దాడి చేశారు. మంలదంలోని శ్రీనివాసపురం గ్రామ శివారులో నిర్వహించిన ఈ దాడిలో బొల్ల గణేష్, మరో ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3,400 నగదు, కోడి కత్తి, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఇరిగేషన్ కాలువ గట్ల ఆక్రమణపై ఫిర్యాదు

**కొయ్యలగూడెం:** దిప్పకాయలపాడు గ్రామ పరిధిలో కొంత మంది భూస్వాములు ఇరిగేషన్ భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నట్లు తనకు ఫిర్యాదు అందిందని పీడబ్ల్యూడీ ఏఈ సీహెచ్ భాస్కరరావు మంగళవారం తెలిపారు. కాలువ గట్లు దున్నేసి పొగాకు, జామాయిల్ తదితర పంటలు వేస్తున్నట్లు కొందరు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. గట్లు కుచించుకుపోవడంతో వర్షాకాలం గట్లు కరిగిపోయి నీరు అంతా ఊరి మీద పడిపోయే అవకాశాలు ఉన్నాయి కాబట్టి దీన్ని వెంటనే పరిష్కరించమని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కలింపూడి సుందరరావు ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు.